





సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

గురువారం 29-5-2025

సంపుటి: 21 సంచిక: 56

పేజీలు: 8 వెల: రూ.1


# పేరు సన్యాసి..
# తీరు సన్నాసి!



- ❖ మహిళా ఉద్యోగులను వేధిస్తున్న ఉద్యోగి
- ❖ స్థాన, రాజకీయ బలంతో అరాచకాలు
- ❖ ఫిర్యాదులు అందినా మొక్కుబడి చర్యలు
- ❖ తాజా ఫిర్యాదుతో వెలుగులోకి నిర్వాకాలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

అతగాడి పేరు సన్యాసిరావు.. కానీ చేసేవన్నీ రోడ్డు రోమియో పనులే. గత పన్నెండేళ్లుగా పొందూరు తహసీల్దారు కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా తిష్ట వేసిన ఈ సన్యాసికి అధికారుల అండదండలు పుష్కలంగా ఉండటంతో అతని చేష్టలకు ఎదురుచెప్పేవారు లేకుండాపోయారు. దానికితోడు స్థానికుడు కావడంతో అతని జోలికి వెళ్లడానికి కూడా తోటి ఉద్యోగులు జంకుతారు. ఇదే అదనుగా ఈ సన్యాసి రెచ్చిపోతున్నాడు. ఎట్టకేలకు ఒక మహిళా ఉద్యోగి ధైర్యం చేసి ఫిర్యాదు చేయడంతో సదరు సన్యాసి అకృత్యాలు బయటపడుతున్నాయి.

**ఎవరూ పనిచేయలేని చోట..**

జిల్లాలో పొందూరు తహసీల్దార్ కార్యాలయానికి ఒక ప్రత్యేకత ఉంది. ఇక్కడ ఎవరూ ఎక్కువ కాలం పనిచేయలేరు. ఇక్కడ పని చేయడం పనిష్మెంట్‌గా భావిస్తుంటారు. లిటిగేషన్లు, వివాదాలు ఎక్కువగా ఉండటమే దీనికి కారణం. అందువల్లే ఎక్కువగా ఇన్‌ఛార్జీలు, ఎఫ్ఏసీ అధికారులతో నెట్టుకొస్తుంటారు. కానీ సన్యాసిరావు మాత్రం బదిలీ లేకుండా 12 ఏళ్లగా పొందూరులోనే పని చేస్తున్నాడు. అతగాడి నిర్వాకాలన్నీ అక్కడ తహసీల్దార్లుగా పని చేసిన వారందరకీ తెలుసు. కానీ ఎవరూ ఇంతవరకు ఆయన్ను టచ్ చేసేందుకు సాహసించలేదు. మహిళా ఉద్యోగుల పట్ల అనుచితంగా ప్రవర్తించినట్టు గతంలోనూ సన్యాసిరావుపై ఆరోపణలు వచ్చాయి. అయితే తహసీల్దారు స్థాయిలోనే అతడిని మందలించి విడిచిపెట్టేసేవారు. అయినా సన్యాసిరావు వక్రబుద్ధి మారలేదు. పాత పద్ధతిలోనే బుధవారం - మిగతా చివరి పేజీలో




చికెన్ ధరలు

| రకం | (బ్యాగ్)లైవ్ | డ్రస్డ్ | స్కిన్‌లెస్ |
|---|---|---|---|
| బ్రాయిలర్ | 150 | 255 | 275 |

Date : 29/05/2025 EditionName : ANDHRA PRADESH( SRIKAKULAM )

చికెన్ ధరలు (కిలోకి - రూ.లలో)

| | వెన్‌కాబ్ | బ్యాగ్ |
|---|---|---|
| ఫారం గేటు | 111 | 100 |
| లైవ్ | 133 | 120 |
| డ్రెస్డ్ | 193 | 210 |
| స్కిన్‌లెస్ | 219 | 220 |

Date : 29/05/2025 EditionName : ANDHRA PRADESH( VISAKHAPATNAM )

చికెన్ ధరలు

| రకం | (బ్యాగ్)లైవ్ | డ్రస్డ్ | స్కిన్‌లెస్ |
|---|---|---|---|
| బ్రాయిలర్ | 120 | 210 | 220 |

Date : 29/05/2025 EditionName : ANDHRA PRADESH ( VIZIANAGARAM ) PageNo :

# ఆ ఇద్దరి గుప్పెట్లో కోడి

- ✷ ఇష్టారాజ్యంగా పేపరుకు ఇచ్చే రేట్లు
- ✷ నెలకు రూ.50 కోట్లకు పైగా దందా
- ✷ పక్క జిల్లాల కంటే మనకే ధర ఎక్కువ
- ✷ ఒడిశాలో చౌకగా దొరుకుతున్న బ్రాయిలర్ చికెన్

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఈరోజు మార్కెట్‌లో కిలో స్కిన్‌లెస్ చికెన్ ధర రూ.275. మనం నేరుగా కొనుగోలు చేయడానికి వెళ్తే రూ.200లే కిలోకు తీసుకుంటున్నారు. అబ్బా.. పేపరు రేటు కంటే రూ.75 కిలో దగ్గర తగ్గుతుందని మురిసిపోవడం మనవంతవుతుంది. కేజీ దగ్గర రూ.75 తగ్గుతుందని, అది కూడా బేరమాడకుండానే ఇచ్చేస్తున్నారంటూ కిలోలకు కిలోలు పట్టుకెళిపోతున్న కుటుంబాలు మనకు తెలుసు. ఈ తరం పిల్లలు బ్రాయిలర్ చికెన్ తప్ప మరోటి తినడానికి ఇష్టపడకపోవడం కూడా మరో కారణం. అయితే మన మార్కెట్‌లో ఇలా పేపరు రేటు కంటే తక్కువకు చికెన్ అమ్మేస్తున్నవారు త్యాగమూర్తులనుకొని అవార్డులో, రివార్డులో ఇచ్చే ప్రయత్నాలు మాత్రం చేయకండి. ఎందుకంటే.. అసలు తెల్లారి లేచి పేపరులో కనిపించే చికెన్ ధరే ఓ పెద్ద కుంభకోణం. పేపరులో ఇలా ఒక అంకెను ప్రకటించడం ద్వారా ఒక్క శ్రీకాకుళం జిల్లాలోనే నెలకు రూ.50 కోట్లు సిండికేట్ సంపాదిస్తుందంటే ఆశ్చర్యం కలగకమానదు. కోడి మీద ఈకలు పీకడమనుకోపోతే బయటి ప్రపంచానికి పట్టని అతి పెద్ద కుంభకోణం బ్రాయిలర్ కోడి రూపంలో నడుస్తుంది. ఎంతసేపు పప్పులు, ఉప్పులు, నూనెల ధరలు పెరిగిపోయాయని గగ్గోలు పెట్టి, ముక్క లేకపోతే ముద్ద దిగని మనం మనకు తెలియకుండానే నెలలో రూ.50 కోట్లు బ్రాయిలర్ సిండికేట్‌కు అప్పగించేస్తున్నాం.

**అసలు పేపరు రేటేంటి..?**

ఉదయం వచ్చే పత్రికల్లో చికెన్ ధరలంటూ ప్రతీ జిల్లా ఎడిషన్‌లోనూ లైవ్ కోడి ఎంత? డ్రెస్డ్ ఎంత? స్కిన్‌లెస్ ఎంత? అనే ఒక రేటును ప్రచురిస్తారు. అంటే మార్కెట్‌లో ఆ రోజు అంతకు మించి చికెన్ ఎక్కువ ధర వసూలు చేయకూడదనేది వారి ఉద్దేశం. కానీ అసలు ఈ రేటులోనే తేడా ఉంది. పత్రికల్లో కిలో ధర ఇంత అని ఇతిమిద్దంగా ప్రకటించేది ఎవరు? అనేది ఆరా తీస్తే, అసలు కుంభకోణం ఎవరు చేస్తున్నారో అర్థమవుతుంది. పత్రికల్లో ప్రకటించే రేటుకు ఏమాత్రం శాస్త్రీయత లేదు. కోడిపిల్లను ఇంతకు కొన్నాం, ఇంత మేపాం, ఇంతకు పెంచాం, ఇన్ని చనిపోయాయి, ఇన్ని మిగిలాయి.. వంటి లెక్కలు వేసుకొని కిలో ఇంత అని లెక్కగడతారనుకుంటే పొరబడినట్టే. ప్రతీనెల తాము అక్రమంగా ఎంత సంపాదించాలో ముందే ఫిక్స్ చేసుకొని, ఆ మేరకు చికెన్ ధరలు పేపరుకు ప్రకటిస్తున్నారు. రిటైల్ వర్తకులు ఇంకా తెలివైనవారు కాబట్టి పేపరు ధర కంటే తక్కువకు అమ్ముతున్నామని బోర్డు పెట్టి మరీ కిలో కొనేవారి చేత రెండు కిలోలు కొనిపిస్తున్నారు. అసలు ఈ రేట్లు ఎవరు నిర్ణయించాలి?

**ఇద్దరి చేతుల్లో చికెన్ ధరలు**

శ్రీకాకుళం నగరంలో కనీసం చికెన్‌వంటకాలు అమ్మే హోటళ్లు చిన్నా, పెద్దా కలిపి 200 పైబడి ఉంటాయి. అలాగే చికెన్ అమ్మే - మిగతా చివరి పేజీలో

## బహిరంగ ప్రకటన

(A) నా క్లయింటు హైదరాబాద్ కాపురస్తులు శ్రీమతి విష్ణు మొలకల శైలజ W/o V.R.S.వెంకటేశ్వరరావు గారు ఇచ్చిన భోగట్టాపైన (I) రాజ్యాంగ సంస్థ అయిన శ్రీకాకుళం ల్యాండ్ సీలింగ్ ట్రిబ్యునల్ ఫైనల్ తేది 3-3-1982 ఆర్డర్స్ (II) మా క్లయింటు ముత్తాత దూసా బలరామస్వామి నాయుడు గారి రిజిష్టర్డు వీలునామా తేది 15-11-1942 Doc. No. 86/1942 (III) హైకోర్టు జడ్జిమెంటు తేది 28-3-2006 in A.S.Nos. 823/1997, 2386/1998, 2387/1998 (IV) హైకోర్టు ఆర్డర్స్ తేది 21-4-2014 in CPR No. 5439 / 2012 (V) హైకోర్టు Status Quo ఆర్డర్స్ IN WP No. 39615/2016 ప్రకారము క్రింద వివరించిన పేరాలు I, II, III స్థిరాస్తులపై సర్వహక్కులు కలవని కోట మెహర్ కుమార్ గారి కుమారుడు కోట సాహిత్యకు (దూసా సాహిత్య బలరామ్ S/o దూసా ఆదినారాయణ కుమారుడు కాదు) ఏ విధమైన హక్కులు లేవని విపులముగా మరియు క్రింద వివరించిన స్థిరాస్తులపైన శ్రీకాకుళం, విశాఖపట్నం కోర్టులలో, హైకోర్టులో కేసులు పెండింగులో ఉన్నవని మరియు విదేశీయుడైన కోట సాహిత్య తేది. 27-6-2019 పైన వివరించిన హైకోర్టు ఆర్డరున్ను, మన దేశ చట్టములను ఉల్లంఘించి చేసిన క్రయ దస్తావేజుల నెంబర్లు 4612/2019, 4613/2019, 4614/2019, 4615/2019, 4616/2019, 4617/2019, 4618/2019, 4619/2019 0 3 మరియు తేదీ 07-09-2011న చేసిన క్రయ దస్తావేజు నెం. 6064/2011 మరియు ఇప్పటివరకు చేసిన ఇతరత్రా లావాదేవీలు VALID కాదని మరియు VOID కావున ఈ క్రయ దస్తావేజులు ఇతరత్రా లావాదేవీలు చెల్లవని, అతనితో లావాదేవీలలో పాల్గొనినచో ప్రాసిక్యూషన్, పెనాల్టి ఇతరత్రా కోర్టు ధిక్కరణ, క్రిమినల్ చర్యలకు గురి అవుతారని ఈనాడు దిన పత్రికలో బహిరంగ ప్రకటనల ద్వార చాలాసార్లు తెలియజేయడమైనది.

(B) విదేశీయుడైన కోట సాహిత్య శ్రీకాకుళం వాసికి జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ ఇచ్చి GPA Holder ద్వారా క్రింద వివరించిన ఆస్తులను అమ్ముటకు ప్రయత్నం చేయుచున్నట్లు మా క్లయింటు దృష్టికి వచ్చినది. కావున ఇందుమూలముగా యావన్మందికి, GPA Holderకు ఈ బహిరంగ ప్రకటన ద్వారా తెలియజేయటమైనది.

(a) నిశ్చయించిన శాసనాల ప్రకారము దావాలు పెండింగులో ఉన్న ఆస్తులను కొనుగోలు, ఇతరత్రా లావాదేవీలు జరిపిన VALID కాదు మరియు VOID. (b) మన దేశ చట్టముల ప్రకారము విదేశీయుడైన కోట సాహిత్యతో స్థిరాస్తి లావాదేవీలు చేయుటకు నిషేదము కలదు. (c) సుప్రీమ్ కోర్ట్ జడ్జిమెంటు తేది. 26-2-2021 IN CIVIL APPEAL No. 9546 of 2010 ప్రకారము R.B.I ముందస్తు అనుమతి లేకుండా విదేశీయుడైన కోట సాహిత్య నుండి మన దేశములోని స్థిరాస్తులు కొనుటకు నిషేదము కలదు. కావున ఈ లావాదేవీలలో కోట సాహిత్యతో అతని GPA Holder ద్వారా పాల్గొనిన, ప్రోత్సహించిన భారీ పెనాల్టీలకు, ప్రాసిక్యూషన్, క్రిమినల్ చర్యలకు గురి అవుతారు. ఆ లావాదేవీలు చెల్లవు. (d) ఇదివరకు నా క్లయింట్ల ద్వార ఈనాడు దినపత్రికలో ఇచ్చిన బహిరంగ ప్రకటనలను ఖండన ప్రకటనలను, శ్రీ పాలిశెట్టి మురళీక్రిష్ణ అడ్వకేట్ గారి ద్వార విదేశీయుడైన కోట సాహిత్య ఇచ్చిన బహిరంగ ప్రకటనలను, ఖండన ప్రకటనలను ఈ బహిరంగ ప్రకటనలో భాగంగా పరిగణించవలెను.

(I) శ్రీకాకుళం జిల్లా మరియు మండలం, పాత్రునివలస గ్రామంలో ఉన్నటువంటి పల్లపు భూములు శ్రీకాకుళం వాస్తవ్యులు లేటు దూసా ఆదినారాయణరావు గారికి ఏవిధమైన హక్కులు లేనటువంటి నా క్లయింటుకు వారి Cousinsకు LRT Orders ద్వారా సర్వహక్కులు కలిగిన భూముల వివరములు:

| వ. నెం. | పాత సర్వే | కొత్త సర్వే | విస్తీర్ణం |
|---|---|---|---|
| 1. | 489 | 278/1 | Ac 0.18 Cents |
| 2. | 488 | 278/2 | Ac 19.10 Cents |

(II) శ్రీకాకుళం జిల్లా మరియు మండలం పాత శ్రీకాకుళం రూరల్, కిల్లిపాలెం పంచాయతీలో ఉన్నటువంటి భూములు శ్రీకాకుళం వాస్తవ్యులు లేటు దూసా ఆదినారాయణరావు గారికి కేవలం జీవిత కాలములో అనుభవించుటకు మాత్రమే క్రయము వగైరా హక్కులు లేనటువంటి ఆయన తదనంతరం అనగా తేది: 04-07-2008 నుండి నా క్లయింట్లకు వారి Cousinsకు సర్వహక్కులు కలిగినటువంటి భూముల వివరములు.

| వ.నెం. | పాత సర్వే | కొత్త సర్వే | విస్తీర్ణం |
|---|---|---|---|
| 1. | 33, 35/2 | 8/1, 5/1, 5/1A | Ac 4.58 Cents |
| 2. | 36, 40/1 | 5/1B, 1/2, 2/1 | |

(III) శ్రీకాకుళం జిల్లా, శ్రీకాకుళం టౌను, బ్రిడ్జి రోడ్డు, డోరు నెం. 9-4-19 గల కూలిపోయిన ఇంటి ఆవరణ 1161 చదరపు గజముల ఇంటి స్థలం నా క్లయింట్లు, వారి Cousins ముత్తాత పూర్వికుల ఆస్తి 3/4వ వంతు వారి తల్లుల ద్వారా సర్వ హక్కులతో కలిగిన ఆస్తి - శ్రీకాకుళం వాస్తవ్యులు లేటు దూసా ఆదినారాయణరావు గారికి ఏవిధమైన హక్కులు లేనటువంటి ఆస్తి. మిగతా 1/4వ వంతు దూసా ఆదినారాయణరావు గారి, ఆయన భార్య దూసా సరోజిని రామాయమ్మ గారి తదనంతరము అనగా 29-12-2010 నుండి నా క్లయింట్లుకు వారి Cousinsకు సర్వహక్కులతో కలిగిన ఆస్తి.

**పంచిరెడ్డి ఈశ్వరరావు**, అడ్వకేట్,
శ్రీకాకుళం, సెల్ నెం. 99495 02216

శ్రీకాకుళం,
తేదీ 29-5-2025.



• ఎడిటోరియల్

# ఉద్యమ పార్టీని ఊపేస్తున్న వారసత్వ ఉప్పెన

ఇంటి ఆడబిడ్డపై పెయిడ్ ఆర్టిస్టులతో తిట్టిస్తే ఏమొస్తుంది? లిక్కర్ స్కామ్‌లో జైలుకెళ్లినప్పుడు పార్టీకి, ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తానంటే వద్దని వారించారు.. మరి ఇప్పుడెందుకు పొగ పెడుతున్నారు? పార్టీ అధినేత కేసీఆర్‌కు తాను రాసిన లేఖను ఎవరు బయటపెట్టారు? అంటూ బీఆర్ఎస్ అధ్యక్షుడు, తెలంగాణ మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖరరావు తనయ కవిత తాజాగా ప్రశ్నాస్త్రాలు సంధించడంతో పార్టీలోనూ, కేసీఆర్ కుటుంబంలోనూ తలెత్తిన వివాదం టీ కప్పులో తుపానులా సమసిపోతుందనుకున్న కార్యకర్తల ఆశలను నీరుగార్చింది. కొన్నాళ్లుగా సాగుతున్న ఈ వివాదానికి పార్టీపై పెత్తనంలో వాటాల విషయంలో అధినేత కుటుంబంలో తలెత్తిన విభేదాలే కారణమని జరుగుతున్న పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ వాటాల విషయం తేల్చాలంటూ కవిత కేసీఆర్‌కు రాసిన లేఖ లీక్ కావడంతో కేసీఆర్ కుటుంబంలోనూ తద్వారా పార్టీలోనూ విభేదాలు రేగుతున్న విషయం వెలుగులోకి వచ్చింది. ఇప్పటికే అధికారం కోల్పోయి పరిస్థితి దిగజారిన తరుణంలో ప్రారంభమైన ఆధిపత్య పోరు పార్టీ పరువును మరింతగా దిగజారుస్తుందన్న ఆందోళన కార్యకర్తల్లో నెలకొంది. అందుకే ఈ వివాదాన్ని మొగ్గలోనే తుంచేయడానికి కేసీఆర్ చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. తన అన్న, పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడుగా ఉన్న కేటీఆర్‌ను టార్గెట్ చేసుకున్న కవిత మరింత రెచ్చిపోకుండా సర్దిచెప్పేందుకు తన సన్నిహితుడైన ఎంపీ దామోదరరావుతో పాటు మరొకరిని కేసీఆర్ రాయబారం పంపినా, స్వయంగా కేసీఆరే ఫోనులో నచ్చజెప్పేందుకు ప్రయత్నించినా ఆమె ఏమాత్రం మెత్తబడలేదు. మరోవైపు కవిత కొత్త పార్టీ పెట్టేందుకు సన్నాహాలు చేస్తున్నారని, జూన్ మొదటి వారంలో అది కార్యరూపం దాలుస్తుందని కవితకు చెందిన తెలంగాణ జాగృతి సంస్థ నేతలు ప్రచారం చేస్తున్నారు. అదే సమయంలో కాంగ్రెస్‌లో చేరేందుకు ఆమె ప్రయత్నిస్తున్నారంటూ గత రెండు రోజులుగా ఒక ప్రధాన పత్రిక రాస్తున్న కథనాలు కలకలం రేపుతున్నాయి. తొలి కథనం ప్రచురితమైన వెంటనే కవిత దాన్ని తీవ్రంగా ఖండించినా.. ఆ కథనాలు ఆగకపోవడం గమనార్హం. దాంతో నిప్పు లేనిదే పొగ రాదు కదా? అని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. గతంలో అమెరికాలో ఉన్న కవిత.. తన తండ్రి తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీని ఏర్పాటు చేసి ప్రత్యేక తెలంగాణ ఉద్యమం ప్రారంభించిన కొన్నాళ వరకు అటువైపు చూడలేదు. ఉద్యమం తారస్థాయికి చేరుకున్న తరుణంలో అమెరికా నుంచి వచ్చేసి టీఆర్ఎస్ పార్టీకి అనుబంధంగా తెలంగాణ జాగృతి అనే సంస్థను ఏర్పాటు చేసి ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత జరిగిన ఎన్నికల్లో గెలిచి టీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడింది. ఆ పార్టీ తరఫున ఎంపీగా గెలిచిన ఆమె ప్రస్తుతం ఎమ్మెల్సీగా ఉన్నారు. అయితే సోదరుడు కేటీఆర్‌ను బీఆర్ఎస్‌కు కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నియమించిన కేసీఆర్, తనను మాత్రం పార్టీలో ఎటువంటి పాత్ర లేకుండా చేయడాన్ని ఆమె జీర్ణించుకోలేకపోయారని అంటున్నారు. తమ ప్రభుత్వం లేని పరిస్థితుల్లో కనీసం పార్టీలోనైనా అన్నతో సమానంగా ప్రాధాన్యం, ప్రాతినిధ్యం కల్పించాలని ఆమె కోరుకుంటున్నారు. అలా జరక్కపోవడంతో మనస్తాపానికి గురయ్యారు. లిక్కర్ స్కాంలో చాన్నాళ్లు జైలు ఉండి బయటకొచ్చిన తర్వాత కొన్నాళ్లు మౌనంగా ఉన్న కవిత పార్టీలో తన పాత్రను, అధికారాన్ని దక్కించుకునేందుకు తండ్రి కేసీఆర్‌పైనే లేఖ రూపంలో ధిక్కార స్వరం వినిపించడంతో పార్టీలోనూ, కేసీఆర్ కుటుంబంలోనూ కలకలం రేగింది. బీజేపీతో బీఆర్ఎస్ వ్యవహరిస్తున్న తీరుపై సందేహాలు వ్యక్తం చేస్తూ.. హన్మకొండలో జరిగిన సిల్వర్ జూబ్లీ సభలో కూడా దానిపై క్లారిటీ ఇవ్వలేదని ఎత్తిచూపారు. కొన్నాళ్లుగా పార్టీ నిర్వహిస్తున్న తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పలు సంచలన విషయాలు లేవనెత్తిన ఆమె పార్టీలో తన పాత్ర, బాధ్యత, అధికారం ఏమిటన్న ప్రశ్నలను కూడా సంధించారు. తనకు బాధ్యతలు అప్పగించకపోతే తన దారి తాను చూసుకోవాల్సి వస్తుందని కూడా హెచ్చరించారు. ఉద్యమం నుంచి పార్టీతోనే ఉన్న తనను విస్మరిస్తున్నారన్న ఆక్రోశం ఆమె రాసిన లేఖలో ప్రస్ఫుటమైంది. దీనిపై పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ స్పందిస్తూ ఇలా రచ్చకెక్కడాన్ని తప్పుపట్టారు. అయితే తాను రాసిన లేఖను బయటపెట్టినవారే దీనికి కారకులంటూ కౌంటర్ ఇచ్చిన కవిత తండ్రి చేసిన రాజీ యత్నాలను కూడా తిరస్కరించడంతో ఈ వారసత్వ ఉప్పెన పార్టీని ముంచేస్తుందేమోనని సగటు కార్యకర్తలు మథనపడుతున్నారు.

## చంద్రబాబును కలిసిన సుజాత

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు కడపలో నిర్వహిస్తున్న మహానాడులో ఆ పార్టీ శ్రీకాకుళం జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు మెట్ట సుజాత మర్యాద పూర్వకంగా కలిశారు. మరోసారి టీడీపీ జాతీయ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన చంద్రబాబుకు ఆమె శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ అభ్యున్నతికి కృషి చేయాలని, ప్రజా సమస్యల పరిష్కారానికి పెద్దపీట వేయాలని తమ్మినేని సుజాతకు చంద్రబాబు సూచించారు. పార్టీ కష్ట కాలంలో ఉన్నప్పుడు అండగా నిలిచిన వారందరికీ భవిష్యత్తు ఉంటుందని హామీ ఇచ్చారు.



## శాఖా గ్రంథాలయంలో చెస్ పోటీలు




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

స్థానిక బలగ హడ్కో కాలనీలో గల శాఖా గ్రంధాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గురువారం పిల్లలకు ముందుగా నీతి కథలు, పత్రికా పఠనము చేయించి తదుపరి పిల్లలకు చెస్‌పోటీలు నిర్వహించారు. ఈ సందర్భముగా గ్రంథాలయ అధికారి పి.ఉగ్రసేను మాట్లాడుతూ చెస్ ఆడటం వలన మేధాశక్తి, ఏకాగ్రత అలవాటు అవుతుందన్నారు. కాబట్టి చదువుతోపాటు ఆటపాటలు కూడా ముఖ్యమేనని పేర్కొన్నారు. కార్యక్రమంలో 26మంది పిల్లలు సహాయకురాలు కె అనిత తదితరులు పాల్గొన్నారు.

## చంద్రన్న ఆశీస్సులు అందుకున్న అచ్చెన్న

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రాష్ట్ర వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు అభినందించారు. కడపలో జరుగుతున్న మహానాడు సంరంభంలో భాగంగా అధినేత ఆయన్ను దగ్గరకు పిలిచి మరీ వ్యవసాయ శాఖామాత్యులుగా మీ పని తీరు బాగుందని కితాబిచ్చారు. రానున్న కాలంలో ఇదే ఉత్సాహంతో పనిచేసి పార్టీకీ ప్రభుత్వానికి ఎంతో మంచి పేరు తీసుకుని రావాలని భుజం తట్టారు. ఇదే సందర్భంలో ఉత్తరాంధ్ర ప్రాంతానికి చెందిన కీలక నేతగా, అన్నయ్య ఎర్రన్నాయుడు ఆశయ సాధనలో భాగంగా అచ్చెన్నాయుడు పనిచేస్తున్న వైనం తనకు ఎంతో ఆనందాన్ని ఇస్తుందని, అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యంగా సుదీర్ఘ తీర ప్రాంతం ఉన్న ఉత్తరాంధ్రకు మేలు చేయాలన్న తలంపుతో పార్టీ ఆదేశాలను, ప్రభుత్వ మార్గ నిర్దేశాలను అర్థం చేసుకుని ఆయన పనిచేస్తున్న వైనం ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉందని కితాబిచ్చారు. సుదీర్ఘకాలంగా పార్టీని నమ్ముకుని ఉన్న కింజరాపు కుటుంబం అంటే తనకు ప్రత్యేక అభిమానమని, శ్రీకాకుళం అంటే తన మదికి ఎర్రన్నాయుడే గుర్తుకు వస్తారని, ఆయన దేశ రాజకీయాలలో రాణించి, ఆ రోజు ఎన్టీఆర్ నుంచి తన వరకూ అందరి ఆదరాన్నీ అభిమానాన్నీ అందుకున్నారని, ముఖ్యంగా ప్రజా సమస్యల పరిష్కారానికి ఆయన చూపిన చొరవ తనను ఆకట్టుకునేదని, ఆయన మరణానంతరం ఆయన చైతన్యంతో ఆయన స్ఫూర్తితో అచ్చెన్నాయుడు పనిచేస్తూ ఉన్నారని ప్రశంసల వాన కురిపించారు. పార్టీ మరియు తాను కష్ట కాలంలో ఉన్నప్పుడు వెన్ను చూపక శత్రు మూకలు ఎన్నో మాటలు అన్నా అవమానించినా కూడా అవేవీ పట్టించుకోకుండా ఆరోజు విపక్షంలో పార్టీ ఉన్నప్పుడు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా విశిష్ట సేవలు అందించిన వైనం తాను ఎన్నటికీ మరువను అని, సుశిక్షిత సైనికుడిగా ఆయన పనిచేసే వైనం నిబద్ధత విశిష్ట గుణం కొత్త వారికి అందరికీ ఆదర్శనీయమన్నారు.



## ముందస్తు ఋతుపవనాలతో రైతులకు మేలు



- సాగుకు అవసరమైన విత్తనాలు ఎరువులు సిద్ధం చేశాం
- కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించడం శుభ పరిణామం
- మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు
- కేంద్ర ప్రభుత్వానికి రైతాంగం తరపున కృతజ్ఞతలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రాష్ట్రంలో నైరుతి ఋతు పవనాలు పవనాలు ముందుగా రావడంతో వర్షాలు ఆశాజనకంగా ఉందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. ఈమేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ ఏడాది ఖరీఫ్ రైతాంగానికి ప్రయోజనం చేకూర్చేలా ప్రణాళికలు రూపొందించామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ముందస్తు వర్షాలకారణంగా ఖరీఫ్ రైతాంగం పనులు ముందుగానే ప్రారంభించుకునేందుకు వీలుందన్నారు. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు రైతులకు అవసరమైన ఇతర సౌకర్యాలు ప్రభుత్వం అందుబాటులో ఉంచామన్నారు. దీనికి తోడు కేంద్ర ప్రభుత్వం క్యాబినెట్‌లో 14 రకాల పంటలను సాగు చేసుకునే రైతాంగానికి మేలు చేకూర్చేలా మద్దతు ధరలను ప్రకటించిందన్నారు. ఇది రైతులకు శుభపరిణామన్నారు. వరి సహా మొత్తం 14 ఖరీఫ్ పంటలకు క్వింటాల్‌పైన కనీస మద్దతు ధర కేంద్రం పెంచిందన్నారు. వీటిలో వరి సాధారణ, గ్రేడ్,ఏలకు రూ.69పెంచగా.. జొన్నలు రూ.328లు, సజ్జలు రూ.150లు, రాగులు రూ.596లు, మొక్కజొన్న రూ.175లు, కందిపప్పు రూ.450లు, పెసర రూ.86లు, మినుములు రూ.400లు, వేరుశెనగ రూ.480లు, పొద్దుతిరుగుడు రూ.441లు, సోయాబీన్ రూ.436లు, కుసుమలు రూ.579లు, వలిశలు (గడ్డినువ్వులు) రూ.820లు, పత్తి రూ.589లు చొప్పున కనీస మద్దతు ధరను పెంచారన్నారు. దీని వలన రాష్ట్ర రైతాంగానికి పెద్దఎత్తున ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం రైతులకు మేలు చేకూరే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.




# ఖలేజా ఎందుకు ఫ్లాపయ్యింది..

# త్రివిక్రముడు ఏం తప్పు చేశాడంటే?

ఓం పూర్ణమదః పూర్ణమిదం పూర్ణాత్ పూర్ణముదచ్యతే..
పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవావశిశ్యతే..
ఓం శాంతిః శాంతిః శాంతిః..

దేవుడూ అతని సృష్టీ పరిపూర్ణాలు, పరస్పర పూరకాలు. కావున పూర్ణంతో ఇంకో పూర్ణాన్ని కలిపినా, వేరుచేసినా, గుణించినా, పూర్ణమే మిగులుతుంది. అలా ఈ ప్రపంచమంతా భగవంతుడి స్వరూపమే అని ఈశావాస్యోపనిషత్తు లోని ఆ శ్లోకం అర్థం.

"దైవం మానుష రూపేణ" అని చెప్పడానికి తీయాలనుకున్న కథ ఖలేజా. ఉద్దేశ్యం ఉదాత్తమైనదే..! పాతిక మంది కేంద్ర మంత్రులూ, వందకు పైగా ఎంపీలూ, ఓ బిజినెస్ మాగ్నెట్టూ కలిసి "పాలి" అనే గ్రామంలో ఉన్న ఇరీడియం నిక్షేపాలను కొల్లగొట్టడం కోసం ఆ ఊరి జనాభాను ఖాళీ చేయించాలనుకుని ఆ ప్రాంతాన్నంతా విషపూరితం చేస్తారు. ఆ ఊరి ప్రజలు దిక్కు తోచక దేవుణ్ని వెదుకుతుంటే హీరో దొరికి, వాళ్ల పాలిటి దేవుడై ఆ ఊరినీ, జనాన్నీ రక్షిస్తాడు. ఇదీ కథ..!

కథ ఎత్తుగడ పాలి గ్రామంలో సుగ్రీవుడు హనుమంతుడిని రాముణ్ణి వెదకడం కోసం పంపుతున్నట్టుగా గొప్పగా మొదలై, పదినిమిషాల్లో నీరసపడిపోతుంది. డిజైనర్ బట్టలు మాత్రమే వేసుకునే హీరో ఓ క్యాబ్ డ్రైవర్. కథ శ్రీకాకుళం జిల్లా "పాలి"లో మొదలై, ఒరిస్సానో, బెంగాలో వెళ్లకుండా రాజస్థాన్‌లో తేలుతుంది.

నీళ్ల సీసా కోసం పేద్ద యుద్ధమైన మరుక్షణం కామెడీ మొదలౌతుంది. విద్యావంతురాలు, ఐశ్వర్యవంతురాలైన కథానాయిక కాలిగోటికి పనికిరానివాళ్లు ఆమెని దరిద్రం, శనీ అంటుంటారు. హీరోని సాక్ష్యం లేకుండా చంపడానికి విలన్లు ఎత్తుగడ వేసి రాజస్థాన్ పంపారని ఇంటర్వెల్ ముందు తెలుస్తుంది.

తర్వాత హీరో దేవుడని నమ్మించే ప్రయత్నంబీ హీరో తాను దేవుణ్నే అని నిర్ధారణకు రావడం అయ్యేసరికి రెండు గంటల స్క్రీన్ టైం పడుతుంది. మిగిలిన నిమిషాల్లో హీరో దుష్ట సంహారం చేసి పాలి గ్రామాన్ని విలన్ల పాలి నుండి రక్షిస్తాడు.

సినిమా కథ నిడివి సాధారణంగా రెండున్నర గంటలు. మొదటి పదినిమిషాల్లో కథావస్తువు తెలియకపోతే చూసేవాడికి బుర్రకెక్కదు. దృశ్యప్రధాన మాధ్యమమైన సినిమాని కేవలం మాటలతో గట్టెక్కించాలనుకుంటే కుదరదు. అంతర్జాలపు హాస్యాన్ని యథాతథంగా కుమ్మరిస్తామంటే చూడడానికి ప్రజలు వెర్రి వెంగళప్పలు కాదు. హాస్యనటులను బఫూన్లుగా చూయిస్తే రాణించదు.

బిలియనీరు, శుద్ధవ్యాపారి ఐన ప్రతినాయకుడు, హింస లేకుండా ఊరిని ఆక్రమిద్దామనుకున్నవాడు, చివర్లో గన్నులూ, గూండాలనేసుకుని మీదడిపోవడం అసలైన కామెడీ.

సినిమా మొదలైన అరగంటలో హీరో దేవుడిలా ఊరిని రక్షించడానికి రంగప్రవేశం చేసి, రాముడిలా కష్టాలకోర్చి, ఒక్కొక్క ఆటంకాన్ని దాటుతూ (శివలో లాగా) చివరికి కార్యసాధన చేస్తే ఫలితం ఇంకోలా ఉండేదేమో..!

చిరుగుల పంచెకి ఎంత డాబు ఉన్న అంచు ఉంటే మాత్రం ఏం లాభం..? శ్రేష్టమైన ములక్కాడలూ, కూర ముక్కలూ, చింతపండూ, పప్పూ, ఇంగువా, దినుసులూ తీసుకుని కలిపినా రుచిలేని పప్పుచారిది! అందుకే సినిమా యూట్యూబ్, టీవీల్లో బిట్లుబిట్లుగా హిట్టై థియేటర్లలో ఫట్టుమంది!!

- గొట్టిముక్కల కమలాకర్



## కాజల్ కెరీర్ ముగిసినట్లేనా?



హీరోయిన్‌గా కాజల్ అగర్వాల్ సినిమా రిలీజ్ అయి రెండేళ్లు అవుతుంది. నటసింహ బాలకృష్ణ హీరోగా నటించిన 'భగవంత్ కేసరి'లో బాలయ్యకు జోడీగా నటించింది. ఆ సినిమా మంచి విజయం సాధించింది. కానీ ఆ తర్వాత కాజల్ హీరోయిన్‌గా కనిపించింది లేదు. రజనీకాంత్ నటించిన 'ఇండియన్ 2'లో నటించింది. కానీ అనూహ్యంగా ఆ పాత్రను 'ఇండియన్ 3'కి మళ్లించారు. ఈ సినిమా ఎప్పుడు రిలీజ్ అవుతుందో తెలియదు? ఈ సినిమాపై ఎలాంటి అంచనాలు కూడా లేవు. బాలీవుడ్‌లో 'సికిందర్' కాజల్ పాత్ర పేరుకే పరిమితమైంది. పాన్ ఇండియా చిత్రం 'కన్నప్ప'లో గెస్ట్ రోల్ పోషిస్తుంది. 'ది ఇండియా స్టోరీ' అనే హిందీ చిత్రం చేస్తోంది. దీంతో పాటు 'రామయణ్' లోనూ ఓ కీలక పాత్ర పోషిస్తుంది. హీరోయిన్‌గా పరిచయమై కాజల్ ఇప్పుడు అతిథి పాత్రలకు.. సెకెండ్ లీడ్‌కు పరిమితమవుతుంది. దీంతో కాజల్ కెరీర్ ముగిసినట్లేనా? అన్న ప్రచారం నెట్టింట మొదలైంది. అమ్మడికి ఇక హీరోయిన్ అవకాశాలు దాదాపు దూరమైనట్లే అంటున్నారు. తెలుగులో సీనియర్ హీరోలతో కూడా ఇప్పటికే పనిచేసింది. మళ్లీ వాళ్ల సరసన ఎంపిక చేయడం కూడా కష్టమే. లేదంటే? త్రిషలా బండి లాంగిచేది. కానీ ఇప్పుడున్న పోటీలో త్రిషలా ఛాన్సులందుకోవడం మాత్రం కాజల్‌కి కష్టమనే మాట వినిపిస్తుంది. టాలీవుడ్‌లో ఇప్పుడు సౌత్ భామలదే హవా. ముంబై, ఢిల్లీ మోడల్స్ కంటే నేచురల్ పెర్ఫార్మర్లకే టాలీవుడ్ ప్రాధాన్యత ఇస్తుంది. ఐదేళ్లగా చెన్నై, కర్నాటక, కేరళ నుంచి ఎక్కువగా హీరోయిన్లు దిగుమతి అవుతున్నారు. ఈ క్రమంలో కాజల్‌కి అవకాశాలు మరింత జఠిలంగా మారతాయని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

- తుపాకి.కామ్ సౌజన్యంతో...

## మత సామరస్యానికి ప్రతీకగా కడప దర్గా

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)


మత సామరస్యానికి ప్రతీకగా కడప దర్గా నిలుస్తుందని శ్రీకాకుళం నియోజకవర్గ శాసనసభ్యులు గొండు శంకర్ అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కడపలోని పెద్ద దర్గాను సందర్శించానన్నారు. దర్గా వద్ద ఆయనకు ఘనస్వాగతం లభించగా, దర్గా మత పెద్దలు సాంప్రదాయరీతిలో తలపాగా చుట్టారు. దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి వాటి విశిష్టతను తెలుసుకున్నారు. కడప పెద్దదర్గాకు ఒక ప్రత్యేకమైన చరిత్ర ఉందని, మత సామరస్యానికి, జాతీయ సమైక్యతకు ప్రతీకగా నిలుస్తుందన్నారు. సేవలకు మారుపేరుగా దర్గా పెద్దల ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలను కూడా చేస్తూ, ఇక్కడ నైపుణ్యాభివృద్ధిపై పేద యువతులకు ప్రత్యేక శిక్షణను ఇస్తూ అండగా ఉంటూ, రక్తదాన శిబిరాలను సైతం నిర్వహిస్తున్నారన్నారు. కులమతాల బేధం లేకుండా అందరూ బాగుండాలనే ఉద్దేశ్యంతో సందర్శించానని తెలిపారు.



## రోడ్లు, కాలువల నిర్మాణానికి శంకుస్థాపన

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

చాపురం విలీన గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న చాపురం, గోవిందపురం గ్రామాల్లో రోడ్లు, కాలువల నిర్మాణానికి శ్రీకాకుళం రూరల్ క్లస్టర్ ఇన్‌చార్జ్ అల్లు నరసయ్య, మట్టా ఆనంద్‌ల ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే గొండు శంకర్ చొరవతో వీటికి నిధులు మంజూరయ్యాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీర్, డిప్యూటీ ఇంజనీర్, అసిస్టెంట్ ఇంజనీర్, డిప్యూటీ ఇంజనీర్, పార్టీ కార్యకర్తలు డొంక శోభన్‌బాబు, వై.చెల్లయ్య, తంగి గోవిందా, పల్ల వెంకటరమణ, మట్టా రమేష్, పంచిరెడ్డి గురునాధం, అల్లు వెంకటరమణ, అల్లు ఉమ, ఎం.సురేష్, పల్లి శేఖర్, అల్లు శ్రీరాములు, ఎ.దలప్పడు, అల్లు రాంబాబు, అల్లు అప్పలరాజు, పల్లి గోవిందా, అల్లు అప్పలనాయుడు, అల్లు ఢిల్లీ, తిప్పన సంతోష్, దుండు సూర్యనారాయణ, సచివాలయం సిబ్బంది హాజరయ్యారు.



## కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ సోదాలు



(సత్యంన్యూస్, టెక్కలి)

నేర నియంత్రణ చర్యలలో భాగంగా జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు టెక్కలి పోలీసు సబ్ డివిజన్ పరిధిలో పోలీసులు గురువారంకార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ సోదాలు నిర్వహించి, విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. జిల్లాలో టెక్కలి,పాతపట్నం, కొత్తూరు, నరసన్నపేట, కోటబొమ్మాళి పోలీసు స్టేషన్‌ల పరిధిలో సీఐ, ఎస్సైల అధ్వర్యంలో సిబ్బంది వారి పరిధిలో ఉన్న పలు వార్డు, గ్రామాలలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. గ్రామాల్లో ప్రతి ఇంటిని క్షుణ్ణంగా తనిఖీ చేసి ఊరు చివర ప్రాంతాల్లో సోదాలు చేసి అక్రమ మద్యం, గంజాయి, నిల్వలుపై ఆరా తీశారు. పాత నేరస్థులు, ట్రబుల్ మాంగర్స్, కొత్త, అనుమానిత,నేర చరిత్ర కల్గిన వ్యక్తులు ఇళ్లల్లో సోదాలు నిర్వహించి, వారి జీవన విధానం,వృత్తి విధానంపై ఆరా తీసి చట్ట వ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలు అరికట్టి,నేర నియంత్రణ చర్యలు చేపడ్తున్న జిల్లా పోలీసులు.ఈ కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ తనిఖీల్లో ఏటువంటి,సరైన వాహన పత్రాలు లేని ద్విచక్ర వాహనాలు గుర్తించి, పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

## ఎన్ వై కే ఆధ్వర్యంలో యోగాసనాల ప్రదర్శన



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

యోగాంధ్ర 2025 వేడుకల సన్నాహకాల్లో భాగంగా శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో గురువారం ఉదయం నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో ఒక ప్రత్యేక యోగాసనాల ప్రదర్శన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నేషనల్ యువత సేవకులు, వివిధ యువజన సంఘాలసభ్యులు ఉత్సాహంగా పాల్గొన్నారు. యోగా గురువులు మురళి, స్వాతిల పర్యవేక్షణలో విశాఖ బి కాలనీ సాయిబాబా మందిరం ఆవరణలో జరిగిన ఈ ప్రదర్శనలో పాల్గొన్న యువత, వివిధ రకాల యోగాసనాలను సమర్థవంతంగా ప్రదర్శించారు. వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు కె. మురళీధర్‌రావు కూడా యువతతో కలిసి యోగాసనాలలో పాల్గొని వారికి స్ఫూర్తినిచ్చారు. జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పిలుపు మేరకు జరిగిన ఈ కార్యక్రమానికి నెహ్రూ యువ కేంద్ర డిప్యూటీ డైరెక్టర్ కె.వి.ఉజ్వల్, అకౌంట్స్ ఆఫీసర్ డి.శ్రీనివాస్, సెట్‌శ్రీ సీఇఓ బి.ప్రసాదరావులు హాజరయ్యారు.

## యోగా భారతీయ జీవన విధానం

(సత్యంన్యూస్, రణస్థలం)

అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని యోగాంధ్ర పేరిట నెల రోజుల రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా గురువారం ఎచ్చెర్ల నియోజకవర్గంలో రణస్థలం, లావేరు మండలాల్లో ఏర్పాటుచేసిన యోగాంధ్రా కార్యక్రమానికి ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా అనేది భారతీయ జీవన విధానమన్నారు. ఇది మనస్సు, శరీరం మరియు ఆత్మను ఒకదానితో ఒకటి సమన్వయం చేయడానికి ఒక మార్గమన్నారు. భవిష్యత్ తరాలకు ఇది వారసత్వ సంపద అని పేర్కొన్నారు. కార్యక్రమంలో రణస్థలం, లావేరు మండలాలకు చెందిన ఎంపీడీఓలు, తహసీల్దార్‌లు, గ్రామ సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.



## చంద్రబాబు ఎన్నిక పట్ల మాదారపు హర్షం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

టీడీపీ జాతీయ అధ్యక్షులుగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎన్నిక కావడం పట్ల నగర టీడీపీ అధ్యక్షుడు, శ్రీకాకుళం జిల్లా నందమూరి బాలకృష్ణ మోక్షజ్ఞ ఫ్యాన్స్ అధ్యక్షులు మాదారపు వెంకటేష్ హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. తెలుగుదేశం పార్టీ, తెలుగుజాతి రాబోయే 40 ఏళ్లలో అన్ని రంగాల్లోనూ అగ్రగామిగా నిలపాలనే గొప్ప సంకల్పంతో “నా తెలుగు కుటుంబం 6శాసనాలు” రూపకర్త నారా లోకేష్‌ను అభినందిస్తున్నానన్నారు. మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు టీడీపీని స్థాపించిన తొమ్మిది నెలల్లోనే అధికారంలోకి వచ్చారన్నారు. ఆయన స్ఫూర్తితో టీడీపీని చంద్రబాబు అనుక్షణం కాపాడుతూ వచ్చారన్నారు. దీని కోసం ఎన్నో కష్టనష్టాలను ఎదుర్కొన్నారన్నారు.



## చంద్రబాబు ఎన్నిక పట్ల అచ్చెన్న ఆనందం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడిగా నారా చంద్రబాబు నాయుడు పార్టీ జాతీయ అధ్యక్షుడుగా ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆనందం వ్యక్తం చేశారు. సుదీర్ఘకాలంగా ప్రజాసేవలో నిమగ్నమవుతూ విజన్ డాక్యుమెంట్–2047లో భాగంగా రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో పురోగమించేలా చేస్తున్నారన్నారు. నవ్యాంధ్ర పురోగమనానికి కృషి చేస్తూ అటు ప్రభుత్వాన్నీ, ఇటు పార్టీనీ సమన్వయపరుస్తున్న సమర్థ నేతగా చంద్రబాబు మంచిపేరు తెచ్చుకున్నారని ప్రశంసించారు. ఈ క్రమంలోనే భాగంగా టీడీపీకి 1995నుంచి ఇప్పటివరకు సుదీర్ఘకాలం అధ్యక్షునిగా సేవలందిస్తూ, తెలుగువారి ఆత్మగౌరవానికి ప్రతికగా చంద్రబాబు నిలుస్తున్నారన్నారు. ఆయన సారథ్యంలో రానున్న కాలంలో మరింత బాగా పనిచేసి రాష్ట్ర అభివృద్ధికి మరింత అంకిత భావంతో పనిచేస్తామని పేర్కొన్నారు. తెలుగుదేశంపార్టీ అంటేనే శ్రామిక, కర్షక ప్రతినిధుల పార్టీ అని, తెలుగు వారు ఎక్కడున్నా వారి అభివృద్ధి కోసం, అభ్యున్నతి కోసం కృషి చేసే పార్టీ టీడీపీయేనన్నారు. రానున్న కాలంలో కార్యకర్తే అధినేత అనే నినాదంతో మరింత బాగా పనిచేయాలని తామంతా భావిస్తున్నామని, అందుకు అధినేత దిశా నిర్దేశం ఆలంబన అని పేర్కొన్నారు.

## సమస్యలపై స్పందించండి

(సత్యంన్యూస్, మెళియాపుట్టి)

మండలంలోని గిరిజన ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గిరిజన గ్రామస్థులు నియోజకవర్గ జనసేన పార్టీ నాయకురాలు కొరికాన భవానికి గురువారం వినతిపత్రం అందజేశారు. మండలం గిరిజన ప్రాంతాలో త్రాగునీరు, వీధిలో సరైన రహదారులు లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. అలాగే రేషన్ తీసుకోవడానికి కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంటుందన్నారు. కూటమి ప్రభుత్వం రేషన్ వాహనాలు రద్దు చేసిందని, తమ కొండ ప్రాంతానికి రేషన్ వాహనం వచ్చేలా చూడాలని కోరారు. వీటికి సానుకూలంగా స్పందించిన కొరికాన భవాని మాట్లాడుతూ ఈ విషయాలను డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేలా చూస్తానని హామీ ఇచ్చారు.



## ఏడాది కూటమి పాలన ‘ఫెయిల్’

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



కూటమి ప్రభుత్వం అన్ని విధాలుగానూ వైఫల్యాలతోనే కాలం నెట్టుకువస్తూ పాలనతో నెగ్గుకురాలేక సతమతమవుతోందని, పైకి బడాయిమాటలు బాగా చెబుతున్నారని, మాటల కారణంగా అభివృద్ధిని అంచనా వేయడం కుదరని పని అని, చేతల్లోనే ఏమన్నా చేసి నిరూపించాలని శ్రీకాకుళం జిల్లా ప్రధాన కార్యదర్శి గేదెల పురుషోత్తం అన్నారు. కడప కేంద్రంగా జరిగిన మహానాడు వేదికపై స్వామి భక్తి ప్రదర్శన తప్ప మరేమీ లేదని పేర్కొంటూ ఆయనొక ప్రకటన విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం గెలిచి దాదాపు ఏడాది కాలం అవుతోందని కానీ ఇప్పటికీ అవే సమస్యలు ఉన్నాయని, బాలారిష్టాలు దాటలేని దుస్థితిలో ఉందని, పాలన ఊసే లేదన్నారు. సూపర్‌సిక్స్ ఊసే లేదన్నారు. ఏం సాధించారని మహానాడు పేరిట మూడు రోజుల ఉత్సవాలకు రూ.కోట్లు వెచ్చిస్తున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ వేదికపై ప్రసంగించిన ముఖ్య నేతలంతా అధినేత చంద్రబాబు, లోకేశ్ పొగడ్తలతోనే కాలం సరిపెడుతున్నారు తప్ప నిర్మాణాత్మక సూచనలేవీ ఇవ్వడం లేదన్నారు. పాలనపరంగా సాధించిన విజయాల వివరణ, ప్రస్తావన అన్నది లేనేలేదని పేర్కొన్నారు. సూపర్–6 హామీల అమలుపై క్యాలెండర్‌ను ఈ మహానాడులో ప్రకటిస్తారని ప్రజలంతా ఆశించారు కానీ, ఆ విధంగా ఆశించిన వారికి నిరాశే మిగిలిందని వాపోయారు. ప్రజలకు ఏ ఒక్క పథకం అమలు చేయకుండా...జగన్‌ను తిట్టడం కోసమే మహానాడు నిర్వహించారా అన్న విధంగా ప్రసంగాలు వినిపించాయన్నారు. వాస్తవ వివరణలు లేదా వాస్తవాల ఒప్పుకోలు అన్నవి లేకుండా కేవలం గతకాల వైభవాన్ని తల్చుకుంటే పనులు జరగవన్నారు. ఫార్టీ ఇయర్స్ ఇండస్ట్రీ అని తనకు తాను చెప్పుకునే చంద్రబాబు ఇంతవరకూ సాధించినదేమీ లేదని ఈ మహానాడుతో తేలిపోయిందని విమర్శించారు.

## చెప్పులు కుట్టిన చేత్తోనే.. సాహిత్య సృష్టి!



పంజాబ్‌లోని చండీగఢ్‌లో టండా రోడ్డుకు ఆనుకుని ఉన్న సుభాష్ నగర్ నివాసి ద్వారకా భారతి(75) 12వ తరగతి పాసయ్యారు. కుటుంబ పోషణకు చెప్పులు కుట్టే పని చేస్తారు. మానసిక ప్రశాంతత కు సాహిత్యం సృష్టిస్తారు. 12వ తరగతి పాసైనప్పటికీ అపారమైన సాహిత్య పరిజ్ఞానం కారణంగా యూనిఫాం ధరించిన వారికి (పోలీసులు/సైనికులు) లెక్చర్లు ఇవ్వడానికి ఆయన్ను ఆహ్వానిస్తుంటారు. పలు భాషల సాహిత్యకారులు ఆయన పుస్తకాలను అనువదించారు. ఆయన స్వయంగా రాసిన ‘ఏకలవ్య’ కవితను ఇగ్నోలో ఎంఏ విద్యార్థులకు పాఠంగా ఉంటే.. పంజాబ్ విశ్వవిద్యాలయంలో రెండు హాస్టళ్లు ఆయన ‘మోచి’ నవలపై పరిశోధనలు చేస్తున్నాయి. ఆయన ఇలా అంటారు.. ‘మీ జీవనోపాధిని పోషించే వృత్తిని సిగ్గుపడేంత తక్కువగా ఎన్నడూ చూడలేం.’

**ద్వారకా మాటలు:** ‘ఇంటిని నడపడానికి బూట్లు కుడతాను, ప్రశాంతత కోసం సాహిత్యాన్ని సృష్టిస్తాను’

ద్వారకా భారతి తను అద్దెకు తీసుకున్న చిన్న దుకాణంలో ఇప్పటికీ చేతితో కొత్త బూట్లను తయారు చేస్తారు. తరచుగా ఆయన దుకాణం వద్దకు పెద్ద వాహనాల్లో సాహితీప్రియులైన అధికా రులు, సాహిత్యకారులు వచ్చి సాహి త్యంపై చర్చించడం దైనందిన జీవితంలో ఒక భాగం. చర్చ జరుగుతున్నప్పుడు కూడా ఆయన తన పని నుంచి తప్పించుకోకుండా, పూర్తి శ్రద్ధతో బూట్లను కుడుతుంటారు. తీరిక సమయాల్లో భారతి తత్వశాస్త్రం, కార్ల్ మార్క్స్‌తో పాటు పాశ్చాత్య, లాటిన్ అమెరికన్ సాహిత్యాన్ని అధ్యయనం చేస్తారు.

### డాక్టర్ సురేంద్ర రచనల నుంచి సాహిత్య స్ఫూర్తి

ద్వారకా భారతి మాట్లాడుతూ.. 12వ తరగతి వరకు చదివిన తర్వాత 1983లో హోషియార్‌పూర్‌కు తిరిగి వచ్చి, తన పూర్వీకుల వృత్తి అయిన చెప్పులు కుట్టే పనిలో నిమగ్నమయ్యారు. చిన్నతనం నుంచే సాహిత్యంతో అనుబంధం ఉండేది. డాక్టర్ సురేంద్ర అజ్ఞాత్ విప్లవాత్మక రచనలతో ప్రభావితులై ‘జూఠన్’ నవలను పంజాబీ భాషలోకి అనువదించారు. ఈ నవల మొదటి సంవత్సరంలోనే బెస్ట్ సెల్లర్ నవలగా నిలిచింది. ఆ తర్వాత పంజాబీ నవల ‘మషాల్చి’ని అనువదించారు. ఈ సమయంలో దళిత దర్శనం, హిందుత్వ కే దుర్గ్ అనే పుస్తకాలు రాయడంతో పాటు హన్స్, దిన్‌మాన్, వాగర్త్, శబ్ద్ పత్రికలలో కవితలు, కథలు, వ్యాసాలు కూడా రాశారు.

ద్వారకా భారతి మాట్లాడుతూ నేటికీ సమాజంలో పాత్రలు కడిగే వారిని, చెప్పులు కుట్టేవారిని (మోచీ) ప్రజలు చిన్న చూపు చూస్తారని, ఇది ప్రతికూల ఆలోచనను ప్రతిబింబిస్తుందని అన్నారు. వ్యక్తిని అతని వృత్తి కాదు, అతని కర్మ గొప్పగా చేస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఇంటిని నడపడానికి బూట్లు తయారు చేస్తారు, మానసిక ఆహారం, ప్రశాంతత కోసం సాహిత్యాన్ని సృష్టిస్తారు. ‘బూట్లు కుట్టడం మా వృత్తి. దీని నుంచే నా ఇల్లు, నా కుటుంబం పోషణ జరుగుతుంది’ అని ఆయన అన్నారు. ఇటువంటి కర్మయోగికి మా నమస్కారాలు.

- సత్యం ఐటీ డెస్క్

-జ్ఞానానికి.. చేసే వృత్తికి సంబంధంలేదు

-సాహిత్యకారులకే మార్గదర్శిగా ద్వారకా భారతి

-పాఠ్యాంశాలుగా ఆయన రచనలు

-నిత్యం ఆయన దుకాణం వద్ద సాహితీ చర్చలు

డ్రైవర్లు కావలెను
సాయిప్రియ ట్రావెల్స్
శ్రీకాకుళంలో పని చేయుటకు
డ్రైవర్లు కావలెను
కనీసం 2 నుండి 3 సంవత్సరాల అనుభవం కావలెను.
CONTACT:
9440001447, 8341163666

ఎం.ఇర్షాద్
USHA
ఆథరైజ్డ్ డీలర్స్
షాప్: 08942-229343
సెల్: 95731 43409
ఎ.కె. ఎంటర్‌ప్రైజెస్
ఉషా సెవింగ్ మిషన్స్, ఆఫీస్ ఫర్నిచర్..
అన్ని రకాల సెవింగ్ మిషిన్లు, ఫేషన్ మేకర్స్, ఎంబ్రాయిడరీ మిషిన్లు, స్పేర్స్ హోల్‌సేల్
రాజా కాంప్లెక్స్, కరెంట్ ఆఫీసు ఎదురుగా, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం - 532 001

SSJ
శ్రీ స్వర్ణ జ్యూయలరీ
ప్రొ॥ వాళ్ళ కిరణ్‌కుమార్
99636 89666, 90009 07133
జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
E-mail: sriswarnajewelleries@gmail.com

SAI OPTICIANS
సరస్వతి మహల్ ఎదురుగా, శ్రీకాకుళం
ప్రొప్రయిటర్: బి.రమణమూర్తి
సెల్: 94407 59739
బ్రాంచ్ ఆఫీస్: గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ రోడ్డు, శ్రీకాకుళం, సెల్: 94407 59739

Siva Srinivasa
Sofa Emporium
Lade Chandra Sekhar Rao
Ph. No: 94401 21710
63053 35395, sekharlifestyle99@gmail.com
NEAR SURYA MAHAL THEATRE
WOMEN'S COLLEGE ROAD,
SRIKAKULAM - 532 001

# ఆ ఇద్దరి గుప్పెట్లో కోడి

(మొదటిపేజీ తరువాయి)

దుకాణాలు కూడా వందకు పైగా ఉంటాయి. ఇంతమంది ఇన్ని రకాలుగా, ఇన్ని ధరలకు అమ్ముతున్నా అంతిమంగా లబ్ధి పొందింది మాత్రం ఇద్దరే. వీరే జిల్లాకు సరిపడా కోళ్లను తెప్పించి అందరికీ సరఫరా చేస్తున్నారు. వీరి వద్ద అంతో ఇంతో తక్కువకు కొనుక్కొని మరికొందరు సబ్‌వ్యాపారం చేస్తున్నారు. అయితే కోడి ధర పేపరుకు ఎంత ఇవ్వాలనేది నగరంలో ఉన్న కేవలం ఇద్దరు నిర్ణయిస్తున్నారు. వీరు ఎంత చెబితే అంతే. సగటు మాంసప్రియుడు పేపరు రేటుకు వచ్చినందుకు మురిసిపోవడమో, పేపరు రేటుకంటే తగ్గిస్తున్నందుకు ఎగిరి గంతేయడమో చేస్తున్నాడు గానీ, అసలు బ్రాయిలర్ కోడేంటి? దాని ధరేంటి? అనేవైపు ఆలోచించడు. సరిగ్గా ఇక్కడే, ఈ బలహీనతనే ఆసరాగా తీసుకొని రూ.50 కోట్లుపైన మూటగడుతున్నారు. పోనీ ఈ కోడి ధరను నిర్ణయిస్తున్న ఇద్దరూ కోడిని పెంచే రైతులా? అంటే.. అదీ కాదు. ఈ రాష్ట్రమంతటికీ కోళ్లు ఎక్కడి నుంచి సరఫరా అవుతాయో, వీరికి కూడా అక్కడి నుంచే వస్తున్నాయి. కానీ జిల్లా పౌల్ట్రీ యజమానుల సంఘం ముసుగులో వీరు పేపరు రేటు నిర్ణయిస్తున్నారు. పేపరు రేటుకు, మార్కెట్ రేటుకు వ్యత్యాసం ఉన్నట్టే మార్కెట్‌లో రూ.200కు కిలో విక్రయిస్తున్న దానికంటే మరో రూ.45 తక్కువకు కిలో చికెన్ దొరకాలి. ఆ మేరకే పేపరులో ప్రకటన ఇవ్వాలి. కానీ వారాల తరబడి పేపరు రేటును మార్చకుండా సొమ్ములు నొక్కేస్తున్నారు. వాస్తవానికి కిలో స్కిన్‌లెస్ చికెన్ రూ.150కి మించి ఉండదు. కానీ దాన్నే రూ.275 కింద చూపిస్తున్నారు.

**మన జిల్లాలోనే అధికం**

రాష్ట్రంలో మిగతా జిల్లాలతో పోలిస్తే శ్రీకాకుళం జిల్లాలోనే చికెన్ రేటు అధికంగా ఉంది. కారణం.. కేవలం ఇక్కడ ఇద్దరి చేతుల్లోనే ఈ మార్కెట్ ఉండటం. దీనికి తోడు నగరంలో హోటళ్లు, సాధారణ వినియోగం ఎక్కువ. నగరంలో ఒకరిద్దరు పెద్ద రిటైల్ వ్యాపారులు పేపరు ధరకంటే తక్కువకు అమ్ముతున్నా, మిగిలిన వారంతా పేపరు రేటు పట్టుకునే వేలాడుతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో అమ్ముడవుతున్న చికెన్ ధరలన్నీ సిండికేట్ సృష్టించినదే. పౌల్ట్రీ అసోసియేషన్ ఏరోజుకారోజు చికెన్ ధరలను నిర్ణయిస్తుంది. అయితే ఇక్కడ కాంపిటేషన్ లేకపోవడంతో ఇద్దరు ఇష్టారాజ్యంగా ఈ రేటును ప్రకటిస్తున్నారు. కిలో కొనుగోలు వద్ద ప్రతీ వినియోగదారుడు రూ.70 పైచిలుకు నష్టపోతున్నాడు. మన పక్క జిల్లా విజయనగరంలో పేపరు రేటు మనకంటే రూ.15 నుంచి రూ.20 తక్కువ ఉంటుంది. ఒక్క ఆదివారమే జిల్లాలో సగటున 15 లక్షల కిలోలు చికెన్ విక్రయిస్తారు. ఇక వెన్‌కాబ్, సుగుణ, స్నేహ వంటి సంస్థలు కోళ్లను సరఫరా చేస్తున్నాయని, అవి కార్పొరేట్ స్థాయిలో ఉంటాయి కాబట్టి రేటు ఎక్కువగా ఉంటుందని చెబుతుంటారు. ఒక కోడిని పట్టుకొని అది వెన్‌కాబా, సుగుణావా అనేది పోల్చడానికి మార్కెట్‌లో యంత్రాలు ఉన్నాయా? ఇది కాకుండా బర్డ్‌ఫ్లూ వంటి వ్యాధి వచ్చినప్పుడు అయ్యో చికెన్ వ్యాపారులు నష్టపోతున్నారన్న సానుభూతి ఒకటి. పౌల్ట్రీ పరిశ్రమ దెబ్బతినకుండా ప్రభుత్వం చికెన్ మేళా నిర్వహించి వండి వార్చడాలు చేయడంతో బర్డ్‌ఫ్లూ వచ్చినా కూడా ఎక్కడా రేటు తగ్గడం కనపడలేదు. ఏ వ్యాపారీ నష్టపోయినట్లు భావించక్కర్లేదు. ఎందుకంటే.. ఒక బ్రాయిలర్ కోడి మీద కోట్లు గడించి ప్రజల్ని నిలువుదోపిడీ చేస్తున్నవారే ఎక్కువమంది ఉన్నారు. మన జిల్లాతో బోర్డర్ పంచుకున్న ఒడిశాలో ఏడాదిలో 300 రోజులు చికెన్ ధర ఒకేలా ఉంటుంది. ఎండాకాలం, వర్షాకాలం అనే తేడా లేకుండా ఒకే ధరకు అమ్ముతున్నారు. శ్రీకాకుళం మార్కెట్‌లో మాత్రం ఇష్టం వచ్చిన ధరలకు విక్రయిస్తున్నారు. రాష్ట్రంలోనే కాదు, దేశంలోనే కోళ్లను తయారు చేసేది, పెంచేది, సరఫరా చేసేది కేవలం కొన్ని కార్పొరేట్ సంస్థలే. మధ్యలో దళారులుగా వచ్చి మనకు విక్రయించడం కోసం ఒక రేటును, హోటళ్లకు ఇవ్వడం కోసం మరో రేటు, రిటైలర్స్ ఇవ్వడానికి ఇంకో రేటు పెట్టి, ఇదేమని అడిగితే రకరకాల పేర్లు చెప్పి దోచుకుంటున్న వైనంపై ప్రభుత్వం ఇంతవరకు దృష్టి సారించలేదు.

# పేరు సన్యాసి.. తీరు సన్నాసి!

(మొదటిపేజీ తరువాయి)

టాయిలెట్‌కు వెళ్లిన ఓ మహిళా ఉద్యోగిని వీడియో తీస్తూ దొరికిపోయాడు. ఇలా చేయడం సన్యాసిరావుకు ఇదే మొదటిసారి కాదని తహసీల్దార్ కార్యాలయ ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. గతంలో కొందరు ఉద్యోగులు అతనిపై ఫిర్యాదు చేసినా కొందరు తహసీల్దార్లు లైట్‌గా తీసుకుంటే, మరికొందరు మొక్కుబడిగా మందలించి విడిచిపెట్టేసేవారని అంటున్నారు. దానికితోడు స్థానికుడైన సన్యాసిరావు.. తన స్థానబలాన్ని చూపించి బెదిరింపులకు పాల్పడుతుండటంతో అతగాడి జోలికి వెళ్లే సాహసం ఎవరూ చేయలేకపోయారు.

**పోలీసులకు ఫిర్యాదు**

తాజా ఘటనలో బాధితురాలైన మహిళా ఉద్యోగి సన్యాసిరావుపై ఎదురు తిరిగి ఆ వీడియోను అతని ఫోనులో నుంచి డిలీట్ చేయించినట్టు తెలిసింది. అక్కడితో ఆగకుండా తహసీల్దారుకు ఫిర్యాదు చేసింది. కుటుంబ సభ్యుల మద్దతుతో పోలీసులకు కూడా ఫిర్యాదు చేశారు. దాంతో స్పందించిన పోలీసులు కేసు నమోదు చేసి సన్యాసిరావు నుంచి ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో గతంలో సన్యాసిరావు వికృత చేష్టలకు బలైనవారు కూడా ఫిర్యాదు చేయడానికి సిద్ధమవుతున్నారు. కాగా సన్యాసిరావును ఈ కేసు నుంచి బయట పడేసేందుకు రాజకీయంగా ప్రయత్నాలు మొదలైనట్లు రెవెన్యూ శాఖలో చర్చ జరుగుతోంది. నాలుగేళ్ల క్రితం డీఎస్‌వో కార్యాలయంలో ఓ కంప్యూటర్ ఆపరేటర్ అక్రమాలకు, వికృత చేష్టలకు పాల్పడిన ఉదంతాన్ని ఉద్యోగులు గుర్తు చేసుకుంటున్నారు. అధికారులు విచారణ జరిపి సదరు అవుట్ సోర్సింగ్ ఉద్యోగిని తొలగించారు. సన్యాసిరావుపైనా ఇదే తరహాలో చర్యలు తీసుకోవాలని బాధిత మహిళా ఉద్యోగులు కోరుతున్నారు. మరోవైపు బాధిత ఉద్యోగిని చేసిన ఫిర్యాదుపై వెంటనే విచారించిన పొందూరు తహసీల్దార్ ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చి సన్యాసిరావును కలెక్టరేట్‌కు సరెండర్ చేశారు. అయితే ఆయనకు రాజకీయ నాయకుల అండ ఉన్నందున వేరేచోటకు బదిలీతో సరిపెట్టేస్తారన్న ప్రచారం జరుగుతోంది. ఇటువంటి కామ పిశాచులు పౌరసరఫరాల సంస్థ, శాఖలోనూ ఉన్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**ఆ రెండు శాఖల్లోనే..**

జిల్లాలో తహసీల్దార్, ఆర్డీవో, కలెక్టర్ కార్యాలయాల్లో 71 మంది కంప్యూటర్ ఆపరేటర్లు అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పని చేస్తున్నారు. వీరంతా రెవెన్యూ కార్యకలాపాల్లో కీలక పాత్ర పోషిస్తున్నారు. వీరితో పాటు పౌరసరఫరాల శాఖ, సంస్థ పరిధిలో మరికొందరు ఉన్నారు. వీరిందరినీ 2012లో విధుల్లోకి తీసుకున్నారు. అలాగే జిల్లాలోని దాదాపు అన్ని ప్రభుత్వ శాఖల్లోనూ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ఉన్నారు. అయితే రెవెన్యూ, పౌరసరఫరా శాఖలు తప్ప మిగిలిన శాఖల్లోని కంప్యూటర్ ఆపరేటర్లకు నేరుగా పౌరులకు సేవలు అందించే పరిస్థితి లేదు. అందుకే రెవెన్యూ కార్యాలయంలో పనిచేసే కంప్యూటర్ ఆపరేటర్లకు మూడేళ్లకోసారి స్థానచలనం కలిగిస్తున్నారు. కానీ పౌర సరఫరాల సంస్థ, శాఖలో మాత్రం ఏళ్లతరబడి కంప్యూటర్ ఆపరేటర్లకు బదిలీల్లేవు. రెవెన్యూ శాఖలో ఒకరో, ఇద్దరో చేస్తున్న అరాచకాలకు మొత్తం కంప్యూటర్ ఆపరేటర్లందరూ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోంది. పొందూరు తహసీల్దారు కార్యాలయంలో మహిళలను చాటుగా ఫోటోలు, వీడియోలు తీసి లైంగిక వేధింపులకు పాల్పడినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న సువ్వారి సన్యాసిరావు 2012 నుంచి అక్కడే కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. మధ్యలో సమీపంలోని సంతకవిటికి బదిలీపై వెళ్లినా ఏడాదిలోనే తిరిగి వచ్చేశాడు. అప్పటి నుంచి పొందూరులోనే తిష్ట వేసి అరాచకాలకు పాల్పడుతున్నాడన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.


## CHANGE OF NAME

Earlier my name is **KATTULAPALLI AKHIL KUMAR REDDY** S/o MOHAN REDDY resident of D.No.: 1-66-11, Plot No. 53, M.V.P. Colony, Sector-2, Visakhapatnam Urban and District, Pin: 530 017, Andhra Pradesh. Presently my name was changed to **KATTULAPALLI VENKATA AKHIL KUMAR REDDY** S/o K.C.MOHAN REDDY therefore now on I will do future correspondence in the name of **KATTULAPALLI VENKATA AKHIL KUMAR REDDY.**


## జాతీయ నాయకులు చరిత్ర తెలుసుకోవాలి



(సత్యంన్యూస్, లావేరు)

జాతీయ నాయకుల జీవిత చరిత్ర ప్రతి విద్యార్థి తెలుసుకోవాలని గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గురువారం లావేరు శాఖా గ్రంథాలయంలో జాతీయ నాయకులు జీవిత చరిత్ర, వారు చేసిన త్యాగాల గురించి విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా కొంతమంది విద్యార్థులు ఆ నాయకుల జీవిత చరిత్ర కథలు చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు టి.వీరభద్రుడు, పాఠకులు పాల్గొన్నారు.






# అటు దారి లేదు.. ఇటువైపు వెళ్లలేము!



- నిర్మాణంలో రైతుబజారు కల్వర్టు
- ఎండీవో కార్యాలయం వైపు ప్రమాదకరంగా కాలువపై పలకలు
- బాగుచేయించాలని కోరుతున్న స్థానికులు
- కాంట్రాక్టర్‌కు నోటీసులు పంపించాం
- ఎ.ఇ. పవన్



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళం నగరం.. చిన్నపాటి వర్షానికే రోడ్ల పైనుంచి నీరు ప్రవహించే ప్రాంతమని అందరికీ తెలిసిన విషయమే. మొస్తరు వర్షం పడితే డే అండ్ నైట్ జంక్షన్ నుంచి రైతుబజార్, కొన్నవీధి వైపు వెళ్లాలంటే ప్రయాణికులకు నరకయాతనే. మొన్న సాయంత్రం నుంచి వర్షం పడింది కాబట్టి సరిపోయింది కానీ, అలాంటి వర్షమే గాని ఉదయంపూట పడివుంటే మరి చెప్పనక్కర్లేదు. రోడ్డుపై రెండు అడుగుల ఎత్తున నీరు నిలిచిపోయి, రోడ్డెక్కడో, కాలువ ఎక్కడుందో తెలియని పరిస్థితి.

**చిన్నబజారు వైపు వెళ్లాలంటే తోవలేదు**

ప్రస్తుతం రైతుబజార్ జంక్షన్ వద్ద కాలువ పనులు జరుగుతున్నాయి. అటు దారి లేదు. పోనీ పక్కనే ఉన్న పరాంకుశనగర్ కాలనీ ఎండీవో కార్యాలయం మీదుగా వెళ్దామంటే కాలువపై పలకలు అంత ఎత్తున ఉన్నాయి. వాహనాలు దాని పైగా ఎక్కించలేక రోజుకు కనీసం ఐదుగురు ఇక్కడ స్లిప్ అయి గాయాలపాలవుతున్నారు. ప్రభుత్వ కార్యాలయం, అందులోనూ ఎంపీడీవో ఆఫీసుకు వెళ్లాలంటే దారి ఇదే. రోజూ అధికారులు, అప్పుడప్పుడు నాయకులు ఇటు వచ్చిపోతుంటారు. అయినప్పటికీ ఈ కాలువపై పలకలు సరిచేసి, ప్లాస్టింగ్ చేయించే విషయంలో ఎందుకో శ్రద్ధ చూపడంలేదు.

**వాహనాలు వెళ్లలేకపోతున్నాయి**

రైతుబజార్ వైపు కాలువ పనులు జరుగుతున్న నేపథ్యంలో అటువైపుగా మనుషులు నడిచేందుకు చిన్న చెక్కను ఏర్పాటుచేశారు. ద్విచక్ర వాహనాలు, కార్లు వెళ్లడానికి పూర్తిగా ఇటువైపు తోవ లేకుండాపోయింది. పక్కనే ఉన్న ఎండీవో కార్యాలయం మీదుగా వెళ్లాలంటే మనుషులైతే మెట్లు ఎక్కినట్లు నడిచి వెళ్లిపోగలరేమో గానీ, ఇక్కడ ఉన్న కాలువపై పలకల పైనుంచి వాహనదారులు మాత్రం రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎండీవో కార్యాలయం రోడ్డు వేసి చాలా కాలమైనా, డ్రైనేజీపై పలకలు మాత్రం ఇప్పటికీ వేయలేదు.

ఎన్నిసార్లు సచివాలయ ఉద్యోగులకు తెలియజేసినా పట్టించుకున్న పరిస్థితి లేకపోవడంతో ఈ విషయమై స్థానిక కాలనీ పెద్దలు, టీడీపీ నాయకులు జి.చంద్రమౌళి కలిసి నగర కార్పొరేషన్ కార్యాలయానికి వెళ్లి కమిషనర్ లేకపోవడంతో ఈ సమస్యపై ఏఈ పవన్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. దీనిపై ఆయన స్పందిస్తూ రోడ్డు వేసిన కాంట్రాక్టర్‌కు ఇప్పటికే రెండుసార్లు నోటీసులు పంపించామని, కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లి త్వరలోనే సమస్యకు పరిష్కారం చూపిస్తామన్నారు.



ప్రమాదకరంగా ఉన్న కాలువ పలకలు

# రెండోరోజు ధర్నాచౌక్‌లో ఎండియూ నిరసన

(సత్యంన్యూస్, విజయవాడ)



ఎండీయూ ఆపరేటర్స్ అసోసియేషన్ ధర్నాచౌక్‌లో చేపట్టిన నిరసన దీక్ష రెండో రోజుకు చేరింది. ఈ సందర్భంగా గురువారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎండియూ ఆపరేటర్స్ రాష్ట్ర నాయకులు 26 జిల్లాల ప్రతినిధులు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఇంటింటికి రేషన్ పంపిణీ వ్యవస్థలో 9260 మంది ఎండియు ఆపరేటర్లు జీవనోపాధి పొందుతూ వారి కుటుంబాలను నెట్టుకొస్తున్నారని, ఈ నెల 20న క్యాబినెట్ తీసుకున్న నిర్ణయం వల్ల ఆయా కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. వీరందరికీ యధావిధిగా జీవనోపాధి పొందడానికి రాష్ట్రవ్యాప్తంగా అనేక శాఖల్లో ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టుల్లో అవకాశం కల్పించాలని, ముఖ్యమంత్రి ఎండియు ఆపరేటర్ల కుటుంబాలకు ఉపాధి చూపించాలని కోరారు. ఈ ధర్నాలో రౌతు సూర్యనారాయణ, కిషోర్, సాంబశివరావు, కాజా శ్రీను, సతీష్, కేశవ, సునీల్, శ్రీను, రవి, దేవా, సుధాకర్, విశ్వేశ్వరరావు, వెంకట్, హేమంత్, మన్మధ, నవీన్, ప్రభాస్, పైడి వరాహ నరసింహులు, నాగేంద్ర, రమణ, కొండబాబు, సిఐటియు రాష్ట్ర నాయకులు ఉమామహేశ్వర రావు, 26 జిల్లాల ఎండియూ ఆపరేటర్లు పాల్గొన్నారు.

# నైరుతి రుతుపవనాలపై సన్నద్ధత / కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జిల్లాలో నైరుతి రుతుపవనాలు వారం ముందుగానే ప్రవేశించిన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధ్యక్షతన జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలసి జరిగిన సన్నద్ధత సమీక్ష సమావేశంలో అన్ని శాఖల జిల్లా అధికారులు కలెక్టర్ కార్యాలయం సమావేశం మందిరంలో పాల్గొన్నారు. గత సంవత్సరం ఎదురైన అనుభవాలను దృష్టిలో ఉంచుకొని, ఈసారి మరింత సమగ్రంగా, పటిష్టంగా ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. విపత్తుల నిర్వహణ సంస్థ జారీ చేసిన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్ఓపి) ప్రకారం కార్యాచరణను రూపొందించుకొని అన్ని విభాగాలు సమన్వయంతో పని చేయాలని ఆయన స్పష్టం చేశారు. ముందస్తు చర్యల్లో భాగంగా జిల్లా, డివిజన్, మండల స్థాయిలో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటుచేసి, వాటి ఫోన్ నంబర్లను ప్రజలకు అందుబాటులో ఉంచాలని కలెక్టర్ సూచించారు. పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు చెరువుల గట్లను ఉమ్మడిగా తనిఖీ చేసి, వాటి స్థితిగతులపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. వర్షాల నేపథ్యంలో వ్యవసాయ శాఖ విత్తనాలు, ఎరువుల పంపిణీపై కార్యాచరణ రూపొందించాలని, నిబంధనలకు విరుద్ధంగా విత్తనాలు, ఎరువులు నిల్వ చేసిన దుకాణాలపై లైసెన్సులు రద్దు చేయాలని హెచ్చరించారు. రైతు సేవా కేంద్రాల ద్వారా విత్తనాలు ఎరువులు పంపిణీకి ఏర్పాట్లు ముమ్మరం చేయాలని తెలియజేశారు. నదీ పరివాహక గ్రామాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, కాజ్‌వేలు రోడ్లపైకి వరద నీరు వచ్చే ప్రాంతాల్లో వాహనాలకు ఆ సమయంలో అనుమతి ఇవ్వకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఇరిగేషన్, విద్యుత్ (ఏపీ ఈపీ డీసీఎల్), రెవెన్యూ, వ్యవసాయ, హార్టికల్చర్ శాఖలు తక్షణ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రత్యేకంగా చెప్పారు. గత ఏడాది హిర మండలం–కొత్తూరు మధ్య రోడ్డుపైకి వరద నీరు వచ్చిన విషయాన్ని గుర్తు చేస్తూ, అటువంటి ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశం ద్వారా జిల్లా యంత్రాంగం రుతుపవనాలకు పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉందని, జిల్లా ప్రజల రక్షణే తమ ముఖ్య బాధ్యతగా భావిస్తూ తగిన చర్యలు తీసుకుంటుందని కలెక్టర్ పుండ్కర్ వెల్లడించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, డిపిఓ భారతీ సౌజన్య, జెడ్పీ సీఈవో శ్రీధర్ రాజా, విపత్తుల నిర్వహణ శాఖ అధికారి రాము, డీఎస్పీ వివేకానంద, శ్రీకాకుళం ఆర్డీవో సాయి ప్రత్యూష, డిఎంహెచ్ఓ అనిత, ఇరిగేషన్ శాఖ పర్యవేక్షక ఇంజనీర్ సుధాకర్, మత్స్యశాఖ ఉపసంచాలకులు సత్యనారాయణ పలు శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.